సాక్షి
సూర్యాపేట
గురువారం । 2 । నవంబర్ । 2023



చిన్న తప్పున్నా తిరస్కరణే..
నామినేషన్లు దాఖలు చేసే సమయంలో చిన్న పొరపాటు చేసినా తిరస్కరణకు గురవుతాయి. - 10లో



సాగర్‌లో బుద్ధిస్ట్ స్కాలర్స్
12 దేశాల బుద్ధిస్ట్ స్కాలర్స్ బుధవారం నాగార్జునసాగర్‌లోని బౌద్ధ క్షేత్రాలను సందర్శించారు. - 10లో

కాంగ్రెస్, కమ్యూనిస్టులదే..
పోరాటాల గడ్డగా మునుగోడు నియోజకవర్గానికి పేరుంది. తొలి, మలిదశ ఉద్యమాలకు వేదికగా నిలిచింది. - 10లో



న్యూస్‌రీల్

8న ఎంజీయూ స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

ఎంజీయూ (నల్లగొండ రూరల్): ఈ నెల 8న మహాత్మాగాంధీ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, మొదటి సారిగా 17 మందికి డాక్టరేట్ పట్టాలు అందించనున్నామని తెలిపారు. ఓయూ మాజీ వీసీ రామచంద్రం పాల్గొననున్న ఈ కార్యక్రమానికి విద్యార్థులు ఉదయం 9.45 గంటలలోపు హాజరు కావాలని కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశాలను గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమానికి లోబడి ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సభ్యులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు తిరుమలగిరి మార్కెట్‌కు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 36,601 బస్తాల ధాన్యం వచ్చి కాంటాలు, ఎగుమతులు ఆలస్యం కావడంతో గురువారం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు యథావిధిగా పని చేస్తుందని పేర్కొన్నారు.

నల్లగొండలో ఉమ్మడి జిల్లా కరాటే పోటీలు



క్రీడాకారులతో డీఈఓ భిక్షపతి, అధికారులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14, అండర్–17, అండర్–19 కరాటే పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నల్లగొండ జిల్లా విద్యాధికారి బి.భిక్షపతి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల ద్వారా దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కరాటే వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఆత్మరక్షణకు దోహదపడుతుందని, ఆపదలో ఉన్నవారిని కాపాడవచ్చన్నారు. ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈ పోటీలకు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి రాజ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు వాసుదేవరావు, కె.ఇందిర, మాజీ కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, పి.నర్సిరెడ్డి, డి.నర్సింహాచారి, సోములు, నగేష్, నాగార్జున, సాగర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్‌కుమార్



చివ్వెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ కమిషనర్

చివ్వెంల(సూర్యాపేట) : రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అక్కలదేవిగూడెం, బి.చందుపట్ల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 17శాతం తేమ ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రెండు కాంటాలు తప్పనసరిగా ఉండాలని, రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే వారి పేరు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ధాన్యం పోసిన తర్వాత పూర్తి బాధ్యత నిర్వాహకులదే అని అన్నారు. తూకాల్లో తేడా రాకుండా మిషన్లు ఎప్పటికప్పుడు చెక్‌చేసుకోవాలని, ధాన్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు లారీలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఎం రాంపతి నాయక్, ఏసీఎస్‌ఓ వెంకట్ రెడ్డి, ఆర్‌ఐ నాగలక్ష్మి, ఏఓ ఆశాకుమారి, సీఈఓ శ్యాంసుందర్ రెడ్డి, ఏపీఎం రాంబాబు, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం



బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పార్టీ సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని, పదేళ్లలో సూర్యాపేట నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులందరూ బీఆర్‌ఎస్ పార్టీ వైపు చూస్తుండటం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తున్నారన్నారు. తెలంగాణలో మూడోసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎరగని ఉపేందర్‌గౌడ్, లింగయ్య గౌడ్, ఎలయ్య, లెనిన్, సందీప్, వరికుప్పల వెంకటేష్, శ్రీకాంత్, వేణు లింగరాజు, తిరుపయ్య పాల్గొన్నారు.

ఒంటరి పోరాటమేనా!

కాంగ్రెస్‌తో పొత్తుపై గందరగోళం

- బలం ఉన్న చోట పోటీకి సిద్ధమవుతున్న కమ్యూనిస్టులు
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు షురూ..
- ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలాబలాలపై అంచనాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు విషయం గందరగోళంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రెండు జాబితాలు ప్రకటించింది. మునుగోడు టికెట్‌ను ఆశించిన సీపీఐకి కాకుండా కాంగ్రెస్ అభ్యర్థికే రెండో జాబితాలో టికెట్‌ను ఖరారు చేసింది. అయితే, రాష్ట్రంలో ఒకవేళ కాంగ్రెస్‌తో పొత్తు కుదరని పక్షంలో మాత్రం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తమకు బలమున్న స్థానాల్లో పోటీపై సీపీఐ ఆలోచనలు చేస్తోంది. ఇక.. సీపీఎం మిర్యాలగూడ స్థానంపై ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం మూడో జాబితా విషయంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. దీంతో సీపీఎంతో పొత్తు ఉంటుందా లేదా అనేది గందరగోళంగా మారింది. ఒక వేళ పొత్తు కుదరకపోతే చివరికి ఒంటరిగా బరిలో దిగేందుకు సీపీఎం సిద్ధం అవుతోంది. పొత్తులపైనే కాకుండా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పోటీలో ఉండబోయే స్థానాలపైనా రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, రాజకీయ పరిణామాలను చూస్తే.. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య పొత్తు కుదరకపోవచ్చని తెలుస్తోంది.

పొత్తు విఫలమైతే..

కాంగ్రెస్ పార్టీతో సీపీఎంకు కూడా పొత్తు కుదరనట్లయితే సీపీఎం, సీపీఐ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఒక వేళ మూడో జాబితాలో ఆయా పార్టీలకు రాష్ట్ర స్థాయిలో పొత్తు కుదిరి వారు అనుకున్న స్థానాలను ఇస్తే ఆయా స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రెండు కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్ మూడో జాబితా వచ్చే వరకు వేచి చూడాలనే ధోరణిలో ఉన్నాయి. పొత్తు కుదరనట్లయితే సీపీఎం, సీపీఐ రెండు పార్టీలు కలిసి పోటీచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా పార్టీలు ఏయే నియోజకవర్గాల్లో పోటీచేయాలి.. ఎవరిని అభ్యర్థులుగా పోటీలో నిలుపాలనే కసరత్తును ప్రారంభిస్తున్నట్లు సమాచారం. నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ , హుజూర్‌నగర్, భువనగిరి నియోజకవర్గాల్లో సీపీఎం ప్రభావితం చేయగలిగే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిల్లో ఏయే స్థానాల్లో పోటీలో ఉండాలన్న దానిపైనా సమాలోచనలు జరుపుతోంది. ఇక సీపీఐ మునుగోడుతోపాటు దేవరకొండ, ఆలేరు, కోదాడ నియోజక వర్గాల్లో ప్రభావితం చేయగలిగే పరిస్థితుల్లో ఉంది. మిగతా నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ నుంచి పోటీ చేయాలనే అంశాలపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

మిర్యాలగూడపై కొనసాగుతున్న సస్పెన్స్

మిర్యాలగూడ స్థానం విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇంత వరకు ఎటూ తేల్చలేదు. మిర్యాలగూడ టికెట్‌ను సీపీఎంకు ఇస్తే కమ్యూనిస్టు పార్టీతో కాంగ్రెస్‌కు పొత్తు ఉంటుంది. లేనట్లయితే పొత్తు ఉండదన్నట్లుగా ఆ పార్టీ వర్గాల నుంచి తెలుస్తోంది. ఇక సీపీఐకి రాష్ట్ర స్థాయిలో పొత్తు ఉంటే మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేయాలని ఇదివరకే నిర్ణయించింది. దీనిపైనా సీపీఐ రాష్ట్ర పార్టీ నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. పొత్తు ఉంటే కాంగ్రెస్ పార్టీ అభిప్రాయం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది.

రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్య ఉద్యమం



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దళిత, గిరిజన, బలహీన వర్గాలకు కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రెమిడాల రాజులు అన్నారు. రాజ్యాంగ రక్షణ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలపైన తీవ్రంగా దాడులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నేత దైద వెంకన్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, రమణ, సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

4న వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ అండర్–19 బాలబాలికల ఎంపిక పోటీలు ఈ నెల 4న నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.వాసుదేవ రావు, కె.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్ వారైతే టెన్త్ మెమో, బోనఫైడ్ పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ : 9848988833, 9640140183 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మళ్లీ ఘాటెక్కిన ఉల్లి!

- తగ్గిన సాగు.. పడిపోయిన దిగుబడి
- నెల రోజుల నుంచి పెరుగుతున్న ధర
- ఇప్పటికే రూ.80 దాటిన రేటు



నాగారం : ఉల్లి మళ్లీ ఘాటెక్కింది. రోజు, రోజుకూ ఉల్లిగడల ధరలు పెరుగుతుండటంతో సామాన్యుడికి కొనకుండానే కన్నీరు తెప్పిస్తోంది. నెల రోజుల నుంచి ఉల్లి ధరలు పైపైకి పోతున్నాయి. డిమాండ్ స్థాయిలో లభ్యత లేకపోవడం, తగినంతగా వర్షాలు కురవకపోవడంతో ఉల్లి సాగు తగ్గి దిగుబడి పడిపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో కేజీ ఉల్లి ధర రూ.10 నుంచి రూ.15 మధ్యలో ఉంది. గిట్టుబాటు ధర రావటం లేదని చాలా మంది రైతులు సాగు చేయకపోవడంతో ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. మార్కెట్‌లోకి ఉల్లి రాకపోవడంతో మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉల్లి ఉల్లిధరలు పెరుగుతున్నాయి. 2018లో ఉల్లి ధర రూ.75 నుంచి రూ.80 వరకు పెరిగింది. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొంది. మరో వైపు ధర ఎంతైనా వంటకాల్లో ఉల్లి లేనిదే కూరగాయలు వండటం సాధ్యం కాదని మహిళలు వాపోతున్నారు.

మహారాష్ట్ర నుంచి దిగుమతి...

జిల్లాలో ఉల్లి విక్రయించే హోల్‌సేల్ వ్యాపారులు సుమారు 50 మంది వరకు ఉన్నారు. వారంతా మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఆగస్టులో కేజీ ధర రూ.20 నుంచి రూ.25 వరకు ఉండగా, సెప్టెంబర్‌లో రూ.30కి పెరిగింది. అక్టోబర్ మొదటి వారం నుంచి ధర క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రిటెయిల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి రూ.70 నుంచి రూ.80కి విక్రయిస్తున్నారు.

ఉల్లిగడ్డలు కొనలేని పరిస్థితి



మార్కెట్‌లో ఉల్లిధర రూ.70కి చేరింది. రోజు, రోజుకూ ఉల్లి ధరలు పెరుగుతుంటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఉల్లి లేకుండా వంటలను చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఉల్లి ధరలను తగ్గించాలి.
– ఎం.డీ. రహీమున్నిసా, తుంగతుర్తి.

ఇదే పరిస్థితి దీపావళి వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట వచ్చాక ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు. సూర్యాపేట జిల్లాకు ఎక్కువగా మహారాష్ట్ర నుంచి ఉల్లి వస్తోంది. ఉల్లి ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉల్లి ధరలు పెరగడాన్ని సాకుగా తీసుకొని మార్కెట్‌లలో, కిరాణం దుకాణాల్లో నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ స్థోమతను బట్టి ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు.

నామినేషన్ల స్వీకరణకు కసరత్తు

రేపు విడుదలకానున్న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్

- అదే రోజు నుంచి నామినేషన్లు
- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- 10వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ
- నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు



సూర్యాపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



తుంగతుర్తిలో నామినేషన్ల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 3వ తేదీన విడుదల కానుంది. అదే రోజు నుంచి ఈనెల 10 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. దీనికి సంబంధించి జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది.

ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లు

సూర్యాపేట నియోజకవర్గంలో ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్డీఓ వీరబ్రహ్మచారి స్వీకరించనున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు తీసుకుంటారు. కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆర్డీఓ, స్థానిక రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తారు.

సీసీ కెమెరాల నిఘా నడుమ..

రిటర్నింగ్ అధికారి కార్యాలయాల పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల నిఘా నడుమ నామినేషన్లు స్వీకరించనున్నారు. వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకే ర్యాలీగా రావడానికి అనుమతి ఉంది. దీంతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల చుట్టూ వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

13న ఉపసంహరణ

గడువులోగా దాఖలైన నామినేషన్లను నవంబర్ 13న రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పరిశీలిస్తారు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయండి

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఆర్‌ఓ (రిటర్నింగ్ ఆఫీసర్)కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు ఆదేశించారు. నామినేషన్ల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే , జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకలతో కలిసి వెబెక్స్ ద్వారా ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పోలీసు సిబ్బందితో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. నామినేషన్ల ప్రారంభ రోజు నుంచి ముగిసే వరకు ఆర్‌ఓ కార్యాలయం వద్ద 100 మీటర్ల వరకు మార్కింగ్ చేయాలన్నారు. ఆర్‌ఓ కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా ముందే పరిశీలించాలని సూచించారు. అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్, అఫిడవిట్ పత్రాలను మే నోయువర్ క్యాండిడేట్ కేవైసీ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, ఆర్‌ఓలు వీరబ్రహ్మచారి, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, డీఎస్పీ నాగభూషణం, రాములు,తహసీల్దార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో నిఘా పెంచాం

- ఎస్పీ రాహుల్ హెగ్డే



సూర్యాపేట క్రైం : బహిరంగ ప్రాంతాల్లో నిఘా పెంచినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్పీ మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక రూట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగడం నేరం అని అన్నారు. మద్యం సేవించి సామాజిక బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే న్యూసెన్స్ కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇలాంటి వారిపై గత మూడు నెలల కాలంలో 1,350 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణ, మండల శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలపై నిఘా కట్టుదిట్టం చేసినట్లు ఆయన చెప్పారు. పాఠశాలల్లో మద్యం తాగడం, పార్టీలు నిర్వహించడం, జూదం లాంటి వాటిని కట్టడి చేస్తున్నామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా కేంద్రం శివారులు, జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు, దాబాలు, కల్వర్టులు, పాడుబడిన బంగ్లాలతో పాటు పాత బస్ షెల్టర్స్, పాఠశాలల ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలలో కొంత మంది మద్యం తాగుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని ఆయన సూచించారు. ఒక వేళ ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

ఓటు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో అర్హత ఉన్న ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు అన్నారు. బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో ఎపిక్ కార్డుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధమని, అర్హత ఉన్న ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ రెండో వారంలో 48,544 కార్డులు, అలాగే చివరి వారంలో 23,569 మొత్తం 72,113 ఎపిక్ కార్డులు అందించామన్నారు. అదే విధంగా 34,180 కార్డులను వచ్చే శనివారం లోపు పోస్టల్ శాఖ ద్వారా అందిస్తామన్నారు. 1,06,293 మంది అర్హులు ఎపిక్ కార్డులు సద్వినియోగం చేసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ యాదగిరి, సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ పోస్టుమాస్టర్ బి. వెంకన్న పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



మట్టపల్లి ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతనపట్టువస్త్రాలలో అలంకరించారు. ముందుగా విష్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్, కమ్యూనిస్టులదే ఆధిపత్యం

- అత్యధిక సార్లు ఆ రెండు పార్టీలదే విజయం
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, రాజ్యసభ సభ్యుడిగా పాల్వాయి రికార్డ్
- గతేడాది జరిగిన ఉప ఎన్నికతో మునుగోడుకు ప్రత్యేక గుర్తింపు



అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్


పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి


ఉజ్జిని నారాయణరావు


పల్లా వెంకట్‌రెడ్డి


ఉజ్జిని యాదగిరిరావు


కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : పోరాటాల అడ్డాగా మునుగోడుకు గుర్తింపు ఉంది. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి వేదికగా నిలిచింది. ఒకనాటి తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఈ ప్రాంతానికి ప్రత్యేక పాత్ర ఉంది. రాజులు ఏలిన రాచకొండ ప్రాంతం సజీవంగా నిలుస్తోంది. దశాబ్దాల కాలం పాటు మావోయిస్టులకు సైతం అడ్డాగా ఉంది. నాడు బతుకు కోసం పోరు చేసిన ఈ ప్రాంతం నేడు అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. వ్యవసాయం, కులవృత్తుల ద్వారా ఇక్కడి ప్రజలు జీవనోపాధి పొందుతున్నారు. చేనేతకు ప్రసిద్ధిగాంచిన చౌటుప్పల్, నారాయణపురం, గట్టుప్పల్ మండలాలు ఈ ప్రాంతానికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చాయి.

చిన్నకొండూరు నుంచి మునుగోడు..

హైదరాబాద్ మహానగరానికి కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం 1967 ఏర్పడింది. అంతకు ముందు ప్రస్తుత చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేది. మొదటి నుంచి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధిపత్యమే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జరిగిన మొదటి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) విజయం సాధించింది. 2018లో కాంగ్రెస్, 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలుపొందాయి. ఈ ఉప ఎన్నిక సందర్భంగా చోటు చేసుకున్న అనేక పరిణామాలతో మునుగోడుకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

అనేక పర్యాయాలు ఆ ఇద్దరే..

మునుగోడు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 12 సార్లు సాధారణ, ఒక ఉప ఎన్నిక జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుంచి దివంగత మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 1967, 1972, 1978, 1983, 1999లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. భవనం వెంకట్రాం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి కేబినెట్‌లలో ఆయన మంత్రిగా పని చేశారు. ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా సైతం పని చేశారు. సీపీఐ నుంచి ఉజ్జిని నారాయణరావు 1985, 1989, 1994 ఎన్నికల్లో విజయం సాధించారు. మొత్తంగా ఎనిమిది పర్యాయాలు ఈ ఇద్దరే నియోజకవర్గాన్ని ఏలారు.

రెండు జిల్లాల పరిధిలో..



మునుగోడు నియోజకవర్గంలో చౌటుప్పల్, మునుగోడు, చండూరు, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో చౌటుప్పల్, చండూరు 2018లో మున్సిపాలిటీగా మారాయి. జిల్లాల విభజన తర్వాత చౌటుప్పల్, నారాయణపురం మండలాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో.. మిగతా 5 మండలాలు నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం ఎలాంటి సాగునీటి వనరులు లేవు. డిండి, చర్లగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్లు పూర్తయితే సాగునీరు అందనుంది. ఇప్పుడు చౌటుప్పల్ మంలంలోని కొన్ని గ్రామాలకు పిలాయిపల్లి కాలువ ద్వారా మూసీ నీరు వస్తోంది. గతంలో ఫ్లోరోసిస్‌తో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.. ప్రస్తుతం కృష్ణా జలాల రాకతో ఆ కష్టాలు తీరాయి.

మునుగోడు నుంచి ఎమ్మెల్యేలు వీరే


సంవ.	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1967	పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	ఉజ్జిని నారాయణరావు	సీపీఐ
1972	పి.గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	ఐ.నారాయణరావు	సీపీఐ
1978	పి.గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	కె.రామకృష్ణారెడ్డి	జనతా
1983	పి.గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	బొమ్మగాని ధర్మభిక్షం	సీపీఐ
1985	ఐ.నారాయణరావు	సీపీఐ	ఎం.నారాయణరావు	కాంగ్రెస్
1989	ఉజ్జిని నారాయణరావు	సీపీఐ	పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్
1994	ఐ.నారాయణరావు	సీపీఐ	పి.గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్
1999	పి.గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	జె.మార్కండేయులు	టీడీపీ
2004	పల్లా వెంకట్‌రెడ్డి	సీపీఐ	సిలివేరు కాశినాథ్	టీడీపీ
2009	ఉజ్జిని యాదగిరిరావు	సీపీఐ	పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్
2014	కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి	టీఆర్ఎస్	పాల్వాయి స్రవంతి	ఇండి
2018	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	కె.ప్రభాకర్‌రెడ్డి	టీఆర్ఎస్
2022 (ఉప)	కె.ప్రభాకర్‌రెడ్డి	బీఆర్ఎస్	కె.రాజగోపాల్‌రెడ్డి	బీజేపీ

చిన్న తప్పున్నా తిరస్కరణే..

- నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా నింపాలి
- ఎన్నికల నియమావళి ప్రకారం అన్ని పత్రాలు సమర్పించాల్సిందే
- ఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు



నల్లగొండ ఆర్‌ఓ కార్యాలయం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. నామినేషన్ల దాఖలు చేసే సమయంలో కొంతమంది అభ్యర్థులు పొరపాట్లు చేస్తుంటారు. దానివల్ల వారి నామినేషన్లు తిరస్కరణకు గురవుతాయి. నామినేషన్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ కొన్ని నిబంధనలు విధించింది. వాటిపై ప్రతి అభ్యర్థికి అవగాహన ఉండాల్సిందే.

నామినేషన్ల నిబంధనలు ఇలా..

- నామినేషన్ పత్రం ఫారం -2(బి)లో సమర్పించాలి.
- నామినేషన్ పత్రంపై అభ్యర్థి తప్పనిసరిగా సంతకం చేయాలి.
- అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసే జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అయితే రూ.5 వేలు డిపాజిట్ చేయాలి. కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. క్యాష్ లేదా చలానా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. డీడీలు, చెక్కులు అనుమతించరు.
- అభ్యర్థులు ఒకే డిపాజిట్‌పై నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అవకాశం ఉంటుంది.
- అభ్యర్థులు భారతీయ పౌరులై ఉండాలి, 25 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. రిజర్వుడ్ నియోజకవర్గం అయితే అందుకు తగిన అర్హత ఉండాలి.
- ఒక అభ్యర్థి రెండు నియోజక వర్గాల్లో మాత్రమే నామినేషన్ వేసేందుకు అవకాశం ఉంది.
- అభ్యర్థుల ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి అందులో నుంచి ఎన్నికల ఖర్చులు చేయాలి. నామినేషన్ దగ్గర నుంచి పోలింగ్ వరకు మొత్తం ఖర్చు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లెక్క చూపాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను నామినేషన్ సమయంలో ఇతరులు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ వారు అయితే ఒకరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. గుర్తింపు లేని పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తే పది మంది ఇతరులు ప్రతిపాదించాలి.

ప్రతీ కాలం నింపాల్సిందే..

అభ్యర్థి నామినేషన్ పత్రంలోని ప్రతీ కాలం తప్పనిసరిగా నింపాల్సి ఉంటుంది. ఆ కాలంలో నింపాల్సింది లేకపోతే.. లేదు, వర్తించదు అని రాయాలి. అంతే కానీ డ్యాష్ (-) వంటి సింబల్స్ రాయకూడదు. ఏ కాలం కూడా ఖాళీగా వదిలేయొద్దు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారం -26 నోటరైజ్డ్ అఫిడవిట్‌లో అన్ని కాలాలను నింపాలి.

అఫిడవిట్ కీలకం..

నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి తనపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో పొందపర్చాలి. వాటి వివరాలను నవంబర్ 15వ తేదీలోగా స్థానిక దినపత్రికల్లో మూడు సార్లు ప్రకటనలు విడుదల చేయాలి. అదే విధంగా చానెళ్లలో కూడా మూడు సార్లు ప్రసారం చేయాలి. దిన పత్రికలు, చానళ్లలో వచ్చిన ప్రకటనల రశీదులను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి. నామినేషన్ ఫారంతో ఫారం-26 అఫిడవిట్ జతపర్చాల్సి ఉంటుంది. రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపరుపై అఫిడవిట్ సమర్పించాలి. అభ్యర్థి రెండు స్టాంపు సైజు ఫొటోలను ఒకటి నామినేషన్ ఫారంపైన, రెండవది అఫిడవిట్ పైన అంటించాలి. అదనంగా నాలుగు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెనుక వైపున అభ్యర్థి లేదా.. ఎన్నికల ఏజెంట్ సంతకం చేసి సమర్పించాలి. అఫిడవిట్‌పై మొదటి తరగతి మెజిస్ట్రేట్ లేదా నోటరీతో అటెస్ట్ చేయించాలి. అలాగే నో డ్యూస్ సర్టిఫికెట్, ప్రమాణం చేసే సర్టిఫికెట్‌ను, సర్టిఫైడ్ ఎక్స్‌ట్రాక్ట్ పత్రాలు జతపర్చాలి.

ఫారం-ఏ, ఫారం-బి సమర్పించాలి..

రాజకీయ పర్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం- బిలను నామినేషన్ చివరి రోజు నవంబర్ 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ సమయంలోగా సమర్పించని వారిని స్వతంత్ర్య అభ్యర్థులుగా పరిగణిస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి బ్యాలెట్ పేపర్‌పై పేరు ఎలా ఉండాలనేది ముందుగానే రాసి ఇవ్వాలి. ముందుగా జాతీయ గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, తరువాత రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, ఆ తర్వాత గుర్తింపు లేని, స్వతంత్రులుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను చేరుస్తారు.

- పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండాలి. దానికి సంబంధించి అటెస్టెడ్ ప్రతిని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ప్రతిపాదకులు మాత్రం అభ్యర్థి పోటీ చేసే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- ఉద్యోగం నుంచి తొలగించబడ్డ వారు పోటీ చేయాలనుకుంటే.. సదరు ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించబడ్డారో తప్పనిసరిగా సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాలు నింపడంలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించేటప్పుడు అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.

తనిఖీల్లో పట్టుబడింది రూ.33.52 కోట్లు

నల్లగొండ : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటి వరకు తనిఖీల్లో నల్లగొండ జిల్లాలో మొత్తం రూ.33,52,11,930, ఇతర విలువైన వస్తువులను సీజ్ చేసినట్లు ఎన్నికల గ్రీవెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ మొత్తంలో కేవలం రూ.6,35,14,860 రిలీజ్ చేసినట్లు తెలిపింది. ఇంకా రూ.27,16,97,070 విడుదల చేయాల్సి ఉంది. రూ.10 లక్షలకు పైచిలుకు నగదు, ఆభరణాలు తీసుకెళుతున్న వారికి సంబంధించిన వివరాలను పోలీసులు ఐటీ శాఖకు అప్పగించారు. ఇప్పటి వరకు 206 కేసులు బుక్ చేయగా.. 196 కేసులు క్లియర్ అయ్యాయి. ప్రస్తుతం ఐటీ శాఖ పరిధిలో రూ.26,98,01,950 సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా 35 కేజీల 32 గ్రాముల బంగారం, 189 కేజీల 436 గ్రాముల వెండి, 3 కేజీల 14 గ్రాముల డైమండ్‌కు సంబంధించి కేసులు ఐటీ శాఖ వద్ద ఉండగా.. అందులో రూ.17,65,950 విలువ చేసే వస్తువులకు సంబంధించి ఆదారాలు చూపడంతో ఐటీ శాఖ రిలీజ్ చేసింది. ఇంకా రూ.26,80,36,000 విలువ చేసే ఆభరణాలు రిలీజ్ కావాల్సి ఉంది.

చండూరు ఆర్‌ఓ కార్యాలయం సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

చండూరు: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎస్పీ అపూర్వరావు బుధవారం చండూరులో మునుగోడు నియోజకవర్గ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయాన్ని సందర్శించారు. శుక్రవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నందున ఏర్పాట్లను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని పోలీసులు సీఐ, ఎస్‌ఐలకు సూచించారు. ఆమె వెంట ఆర్‌ఓ దామోదర్ రావు, ఎస్‌ఐ రవీందర్ రెడ్డి, ఎలక్షన్ డీటీ దీపక్, స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అడుగడుగునా తనిఖీలు

ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో స్థానిక పోలీసుల సహకారంతో కేంద్ర బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగా బుధవారం నల్లగొండలోని రామగిరి సెంటర్‌లో కేంద్ర బలగాలు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ







ఓటును అమ్ముకోవద్దు

- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పద్మనాభరెడ్డి


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న పద్మనాభరెడ్డి తదితరులు

నల్లగొండ టౌన్ : ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురై నోటుకు ఓటును అమ్ముకోవద్దని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.పద్మనాభరెడ్డి సూచించారు. బుధవారం నల్లగొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ క్యార్యదర్శి సోమ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లు చైతన్యవంతులుగా ఉండి నిస్వార్థంగా సేవ చేసే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ప్రధానంగా ఉచిత విద్య, వైద్యం అందించే వారిని ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్లను చైతన్యం చేయడంలో మేధావులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంఘాలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల నుంచి ఎటువంటి లబ్ధి పొందకుండా ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేస్తామని సభకు హాజరైన వారిచే ప్రమాణం చేయించారు. జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరు, పాలనా విధానం, ఓటు విలువను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం.నర్సింహారెడ్డి, డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, పి.భాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, సురేష్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, ఎంవీ.గోనారెడ్డి, కోటగిరి దైవాదీనం, రామలింగ, సతీష్, కత్తి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, షాపల్లి రవిప్రసాద్, భాస్కర్‌రావు, సూర్యవర్ధన్‌రెడ్డి, జిలుగు జ్యోతిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 126 అ) సబ్ సెక్షన్(1) ప్రకారం అధికారాన్ని ఉపయోగించి సబ్ సెక్షన్(2) అనుసరించి ఈ నెల 7న ఉదయం 7 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తులు లేదా పార్టీలు ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, ఫలితాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తే.. చట్టం ప్రకారం రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా ఉంటాయని తెలిపారు.

చలకుర్తి నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెద్దవూర: పెద్దవూర మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024- 25కు సంబంధించి తొమ్మిది, పదకొండో తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం తెలిపారు. పదకొండో తరగతిలో ప్రవేశానికి జేఎన్‌వీ చలకుర్తి క్యాంపులో గాని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుతూ ఉండాలని, 01-06-2007 నుంచి 31-07-2009 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సైన్స్ సబ్జెక్టులు ఉంటాయని, ప్రశ్నపత్రం హిందీ, ఆంగ్ల భాషల్లో ఉంటుందని పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి ప్రవేశానికి గాను ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలని, 01-06-2009 నుంచి 31-07-2011 మధ్యన జన్మించి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులందరికీ ఇదే వయసు నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు. పరీక్షలో హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని, ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష 10-02-2024న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఫారాన్ని నింపి, దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను కోదాడ రూరల్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామ ప్రాంతంలోని కాసరాబాద్ ఇసుక రీచ్ నుంచి కోదాడ మీదుగా హైదరాబాద్‌కు టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బుధవారం కోదాడ మండలంలోని తొగర్రాయి సబ్‌స్టేషన్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ రాజేష్‌తో పాటు ఓనర్ గోపిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

20 మంది బైండోవర్

మోతె: మండల పరిధిలోని ఉర్లుగొండ, హుస్సేన్‌బాద్, సర్వారం, సిరికొండ గ్రామాలకు చెందిన 20 మందిని స్థానిక తహసీల్దార్ ప్రకాష్‌రావు సమక్షంలో రూ.లక్ష పూచీకత్తుతో బుధవారం బైండోవర్ చేసినట్లు మోతె ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల సమయంలో పోలీసులకు సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

యువకుడిని వరించిన అదృష్టం


రూ.10 లక్షల స్క్రాచ్ కార్డు అందుకుంటున్న మహేష్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామానికి చెందిన యువకుడు మహేష్‌ను అదృష్టం వరించింది. బుధవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల ఓ మొబైల్ దుకాణంలో ఒప్పో (ఏ 18) ఫోన్ కొనుగోలు చేశాడు. దీపావళి నేపథ్యంలో కంపెనీ ప్రకటించిన ఆఫర్లలో భాగంగా దివాళి రాఫెల్ యాక్టివిటీ స్క్రాచ్ కార్డులో రూ.10 లక్షలు గెలుపొందాడు. దీనికి సంబంధించిన స్క్రాచ్ కార్డును మొబైల్ షాపు యజమాని మహేష్‌కు అందించారు. అతడిని ఒప్పో తెలంగాణ సేల్స్ హెడ్ వంశీ, నల్లగొండ ఎస్ఎం సునీల్, , సూర్యాపేట ఏరియా డిస్ట్రిబ్యూటర్ విజయ్ అభినందించారు.


అనాథలను ఆదరించడం అభినందనీయం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముక్తేశ్వర్‌రావు


మాట్లాడుతున్న ముక్తేశ్వర్‌రావు

చౌటుప్పల్: మతిస్థిమితం లేనివారిని, అనాథలను ఆదరించడం గొప్ప విషయమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముక్తేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో రూ.12కోట్ల వ్యయంతో 5అంతస్తుల్లో 2వేల మందికి ఆశ్రయం కల్పించే విధంగా నూతనంగా నిర్మించిన అమ్మానాన్న అనాథాశ్రమ భవనాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు శంకర్‌ను అభినందించి సత్కరించారు. వారు మాట్లాడుతూ 13ఏళ్ల క్రితం పుట్టిన ఆలోచన ఇంతటి గొప్ప స్థాయికి చేరడం సాధారణ విషయం కాదన్నారు. సొంత కుటుంబ సభ్యులే పట్టించుకోని ప్రస్తుత సమాజంలో మతిస్థిమితం లేని వారిని, వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తులను ఆదరిస్తున్న గట్టు శంకర్ సేవలు అభినందనీయమన్నారు. ఆశ్రమ ప్రారంభంలో అద్దె గదిలో ఉండి అనాథలకు అన్నం పెట్టేందుకు అవస్థలు పడిన ఆశ్రమం నేడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక స్థానాన్ని పొందిందని గుర్తు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్ మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారంతో ప్రస్తుతం 600 మందికి సేవలు అందుతున్నాయని తెలిపారు. ఉభయ రాష్ట్రాల్లో అనాథలు, మతిస్థిమితం లేని వ్యక్తులు ఎక్కడ ఉన్నా ఇక్కడికి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్‌రెడ్డి, విరాహత్ అలీ, ఆశ్రమ సిబ్బంది గణేష్, శ్రీను, రవి, నవీన్, దాతలు తదితరులున్నారు.

సాగర్‌ను సందర్శించిన బుద్ధిస్ట్ స్కాలర్స్


నాగార్జునకొండలోని మ్యూజియం వద్ద వివిధ దేశాల బుద్ధిస్ట్ స్కాలర్స్

నాగార్జునసాగర్: ప్రపంచంలోని 12 దేశాలకు చెందిన బుద్ధిస్ట్ స్కాలర్స్ బుధవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ సీనియర్ ప్రోగ్రాం డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. భారత విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకు 12 దేశాలకు చెందిన బుద్ధిస్ట్ స్కాలర్స్ 'బుద్ధభూమి వందన యాత్ర' పేరుతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సెమినార్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్లలో భారత దేశంతో పాటు థాయిలాండ్, తైవాన్, కంబోడియా, శ్రీలంక, మలేషియా, భూటాన్, జపాన్, లావోస్, వియత్నాం, దక్షిణ కొరియా, నేపాల్ దేశాలకు చెందిన బుద్ధిస్ట్ స్కాలర్స్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. వీరు భారతదేశంలోని బుద్ధగయ, వారణాసి, సారనాథ్, ఔరంగాబాద్, అజంతా లాంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను సందర్శిస్తూ బుధవారం నాగార్జునసాగర్‌కు వచ్చినట్లు తెలిపారు. కాగా 33మందితో కూడిన బృందం నాగార్జునసాగర్‌కు చేరుకొని అక్కడి నుంచి లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధుడి అవశేషాలు, సింహల విహారం, మహాస్థూపంతో పాటు బౌద్ధ క్షేత్రాలను సందర్శించారు. అనంతరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనం చేరుకొని బుద్ధచరిత వనంలోని బుద్ధుని పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించి ప్రార్థనలు చేశారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ గురించిన చారిత్రక వివరాలను వివరించారు. వారి వెంట స్థానిక ఎస్‌ఐ సంపత్‌గౌడ్, ప్రోటోకాల్ డిప్యూటీ తహసీల్దార్ శరత్ చంద్ర తదితరులు ఉన్నారు.